www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబర్ 2025



ఎరువులు అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా


ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా హెచ్చరించారు. స్థానిక వెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.

అనంతరం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో ఇ-పంట నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ నూరుశాతం ఇ-పంట నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సుబ్బారావు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

దూసుకొస్తున్న మొంథా

- రెండు జిల్లాల్లో అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధం
- ప్రత్యేకాధికారులుగా ఏలూరుకు కాంతిలాల్‌దండే, పశ్చిమకు ప్రసన్నవెంకటేష్
- కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- గోదావరిపై లాంచీలు, పంటుల రాకపోకలు నిషేధం
- ఆదివారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు
- బిక్కుబిక్కుమంటున్న తీరప్రాంత ప్రజలు



ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రెండు జిల్లాల్లో అధికార యంత్రాంగం యావత్తూ సన్నద్ధమైంది. జిల్లా కలెక్టర్ల నుంచి గ్రామస్థాయి ఉద్యోగి వరకూ అంతా తుపాన్ ముందస్తు చర్యలకు సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను రద్దు చేశారు. జిల్లా అధికారుల నుంచి దిగువస్థాయి ఉద్యోగి వరకూ అందరికీ సెలవులు రద్దు చేసి తమ తమ పని ప్రదేశాల్లోనే ఉండాలని కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇప్పటికే సెలవుల్లో ఉన్నవారిని సైతం సెలవులు రద్దు చేసుకుని విధుల్లోకి రప్పించేలా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. రెండు జిల్లాలకు అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఏలూరు జిల్లాకు కాంతిలాల్‌దండే, పశ్చిమగోదావరి జిల్లాకు ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు.


జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మొంథా తుపాన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఆదివారం జిల్లా ఎస్‌పితో కలిసి పర్యటించారు. కొల్లేరు పెద్దఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్క తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొల్లేరులో పడవల రాకపోకలను నిషేధించారు. కొల్లేరుకు వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి మొంథా తుపాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా అధికారులను ఆదేశించారు. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరిపై లాంచీల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. నరసాపురం-సఖినేటిపల్లి మధ్య గోదావరిపై పంటు రాకపోకలను సైతం నిలిపివేసి, ఎవరూ గోదావరి వైపు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ముందస్తుగా ఈ నెల 27, 28 తేదీల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అత్యవసర వేళల్లో ఆదుకునేందుకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఎస్‌డిఆర్ఎఫ్ బలగాలు రానున్నాయి. రెండు జిల్లాల్లో కలెక్టరేట్‌తోపాటు అన్ని ఆర్‌డిఒ, మండల, పట్టణ కేంద్రాలతోపాటు పోలీసు స్టేషన్లలోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. గాలుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలతోపాటు శిథిలావస్థలో ఉన్న భవనాల్లోని ప్రజలను ఆదివారం రాత్రి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. విద్యుత్, కమ్యూనికేషన్, రోడ్డు రవాణా వ్యవస్థలు స్తంభించకుండా ఆయా జిల్లాల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్లు ఆదేశించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించేందుకు ఇపిడిసిఎల్ కార్యాలయం నుంచి సిజిఎం, జిఎం, ఇఇ, డిఇఇలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. మిగిలిన డిస్కంల నుంచి సిబ్బందితో పాటు, పోల్స్, ఇతర సామగ్రిని తుపాను ప్రభావం ఉండేలా ప్రాంతాలకు తరలింపు ప్రక్రియ ప్రారంభించారు. అన్ని డివిజన్లలో విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది.

నష్టం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

కొల్లేరు పెదఎడ్లగాడి వద్ద మేటల పరిశీలన

ప్రజాశక్తి - మండవల్లి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ముంచుకొస్తున్న మొంథా తుపాన్ ప్రభావం వల్ల ఎటువంటి ప్రమాదాలూ, నష్టం సంభవించకుండా అధికారులంతా అప్రమత్తతతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఆమె పెద్దఎడ్లగాడి వంతెన వద్ద మేటవేసుకుపోయిన గుర్రపు డెక్కను, మణుగులూరు-పెనుమాకలంక రహదారిపై ప్రవహిస్తున్న వరద నీటిని, కొల్లేటి నీటిమట్టాని అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు కొల్లేరులోకి ఎంత వచ్చి చేరుతుంది, దిగువ ప్రాంతానికి ఎంత వరద నీరు వెళ్తోంది అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాన్ ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈదురు గాలులు, వర్షం అధికంగా ఉండే పరిస్థితి ఉన్నందున అధికారులంతా గ్రామాల్లో అందుబాటులో ఉండి ఎటువంటి ప్రాణ నష్టాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రజలకు భోజన వసతి ఏర్పాటు చేయడంతోపాటు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈదురుగాలుల నేపథ్యంలో పెనుమాకలంక నుండి పెద్దఎడ్లగాడికి ఏర్పాటు చేసిన బోటు ప్రయాణాన్ని నిలుపుదల చేయాలని, వరద నీటిలో రహదారిపై రాకపోకలను ఆపాలని ఆమె అధికారులను ఆదేశించారు. పెద్దఎడ్లగాడి వంతెన వద్ద మేట వేసుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ కె.గోపాల్, సిఐ రవికుమార్, ఆర్ఐ శ్రావణి తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నేటి నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం

మంత్రి కొలుసు పార్థసారధి



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మొంథా తుపాన్ నేపథ్యంలో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని, ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి సూచించారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. తుపాన్ ముందస్తు చర్యలపై మంత్రి జిల్లా అధికారులతో వర్చువల్‌గా ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాలు, గాలుల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు పక్కాగా ఉండాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వాగులు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద వరద నీటి ఉధృతి కారణంగా ఎటువంటి ప్రమాదాలూ సంభవించకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు నష్టం వాటిల్లకుండా వీలైనంత వరకూ ముందస్తు చర్యలు చేపట్టాలని, తుపాన్ అనంతరం పంట నష్టం వివరాలు సమర్పించాలని ఆదేశించారు.

గోదావరిపై లాంచీలు, పడవల రాకపోకల నిలిపివేత

ప్రజాశక్తి - పోలవరం

మొంథా తుపాన్ ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గోదావరి నది ఫెర్రీ రేవుల నుండి లాంచీలను తిప్పకుండా తాత్కాలికంగా నిలిపివేయాలని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం పట్టిసీమ ఫెర్రీరేవులో సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పోలవరం మండలంలోని పట్టిసీమ ఫెర్రీ రేవు, పాత పోలవరం, పురుషోత్తపట్నం ఫెర్రీ రేవులతోపాటు కుక్కునూరు, వేలేరుపాడుల్లోని లాంచీలను తుపాన్ ప్రభావం వల్ల మూడు రోజులు నిలిపివేయాలని ఆదేశించారు. మత్స్యకారులు గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప మూడు రోజులు బయటకు రావొద్దని, గోదావరిలోకి స్నానాలకు దిగరాదని కోరారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - ఏలూరు

మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 27న సోమవారం జిల్లాలో కలెక్టరేట్, ఆర్‌డిఒ, మండల, పట్టణ కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్లు డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు. అధికారులందరూ తుపాన్ ముందస్తు చర్యల్లో నిమగ్నమై ఉంటారని తెలిపారు.

నేడు, రేపు భారీ వర్షాలు, బలమైన గాలులు

హోర్డింగులు, విద్యుత్ స్తంభాల వద్దే ముప్పు

ఎస్‌పితో కలిసి అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మొంథా తుపాన్ ప్రభావంతో ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు తీవ్రగాలులు, భారీ వర్షాల కారణంగా హోర్డింగులు కూలే ప్రమాదం ఉందని, ఆ కారణంగా ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. తుపాన్ తీవ్రతపై జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా ఎస్‌పితో కలిసి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆమె అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తుపాన్ తీరం దాటే సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, ఆ రీత్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని, ప్రయివేటు విద్యా సంస్థల్లో స్టడీ అవర్స్ వంటివి నిర్వహించకుండా విద్యా శాఖ అధికారులు పరిశీలించాలన్నారు. జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9491041419, టోల్ ఫ్రీ నెంబర్ 18002331077లకు ఫోన్ చేసి ప్రజలు తుపాన్ పరిస్థితి తెలుసుకోవచ్చని, అవసరమైన సహాయం పొందవచ్చని అన్నారు. కూలిన చెట్లు వెంటనే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు ప్రతి గ్రామానికీ ఒక నోడల్ అధికారిని నియమించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లలోని వ్యక్తులను, లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదివారం రాత్రి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లలో వరద నీరు చేరి నివాసిత ప్రాంతాలు ముంపునకు గురికాకుండా మురుగును వెంటనే తొలగించాలన్నారు. తుపాన్ సహాయక కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ మండల స్థాయిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుర్గంధం.. కటిక నేలపై నిద్ర

- వెంటాడుతున్న తాగునీటి సమస్య
- అసంపూర్ణంగా కొత్త భవనాల నిర్మాణం
- అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల దుస్థితి



ప్రజాశక్తి పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం.. ఆపై దోమల స్వైరవిహారం.. ఈ క్రమంలో సాఫీగా పడుకుందామంటే బెడ్స్ కరువాయే.. ఇదీ పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల దయనీయ పరిస్థితి. ఈ పాఠశాలలో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో విద్యార్థులు ప్రతిరోజూ దాహార్తితో అలమటిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 550 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పాఠశాల ప్రారంభం నుంచి తాగునీటి సమస్య అపరిష్కృతంగానే ఉండటం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా పాఠశాల ప్రారంభించారు. అయితే భవనాల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఒకే భవనంలో చదువుకుంటూ, అక్కడే నిద్రించాల్సిన దుస్థితి ఉంది. వంట సైతం అదే భవనంలో కొనసాగిస్తున్న పరిస్థితి. కొద్దిపాటి వర్షం కురిసినా పాఠశాల ప్రాంగణం మొత్తం నీటితో నిండి అడుగు బయటపెట్టలేని పరిస్థితి ఉంది. దీంతో ఆటలు వంటి వాటికి విద్యార్థులు దూరమవుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. అదే సమయంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దోమల కారణంగా రాత్రివేళల్లో కంటి మీద కునుకు ఉండటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో బెడ్స్ లేకపోవడంతో నేల మీద పడుకుంటున్నారు. ఇప్పటి వరకూ దుప్పట్లు ఇవ్వకపోవడం, మరోపక్క దోమలు, ఇంకో పక్క చలి తీవ్రత పెరగడంతో విద్యార్థులు రాత్రివేళల్లో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.



అసంపూర్తిగా భవన నిర్మాణం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం పూర్తికాకపోవడంతో విద్యార్థుల అవస్థలు కొనసాగుతున్నాయి. డార్మెటరీ, కిచెన్ నిర్మాణాలు పూర్తయినా విద్యార్థుల అవస్థలు కొంత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి, అసంపూర్ణంగా ఉన్న భవనాల నిర్మాణం పూర్తి చేయడంతోపాటు పాఠశాల ఆవరణలో నీరు నిల్వలేకుండా ఉండేలా మెరక చేయడంతోపాటు డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని, తాగునీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన తక్షణం పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం నేతల డిమాండ్



నేలనంటిన పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భారీ వర్షాలకు జిల్లాలో వివిధ పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లో భారీ వర్షాలకు నేలనంటిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తి, పొగాకు, మినుములు, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టాలను నమోదు చేసి రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. తుపాన్ హెచ్చరికలు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పలిన్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, రైతులు పంపన పాపయ్య, గోలి నర్సిరెడ్డి, గోలి సత్తిరెడ్డి, వందనపు సాయిబాబా, పర్రెడ్డి లక్ష్మిరెడ్డి, ముళ్లపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా రమేష్‌కుమార్



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు ఆదివారం స్థానిక రెవెన్యూ భవనంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా ఏలూరు అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ కె.రమేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.విజయకుమార్‌రాజు, ఉపాధ్యక్షులుగా గాకె చల్లన్నదొర, కె.రవిచంద్రరావు, ఎం.సోమేశ్వరరావు, పి.మాధవి, సెక్రటరీగా ఎ.ప్రమోద్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిహెచ్.యశ్వంత్ ఎన్నికయ్యారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా బి.సందీప్ గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్.స్వామి, జె.శ్రీనునాయక్, పి.నాజీమ బేగం, ఎం.మల్లి కార్జునరావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఆర్.వెంకటరాజేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా టి.రాజరత్న కుమార్, కె.నరసింహారావు, స్టేట్ కౌన్సిలర్‌గా జిఎన్‌సి.శేఖర్‌బాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సిహెచ్.వీరాంజనేయప్రసాద్ వ్యవహరించారు. కె.రమేష్‌కుమార్ అధ్యక్షులుగా మూడో సారి ఎన్నిక కావడం విశేషం.

బిజెపికి ప్రజాభిప్రాయం పట్టదా

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఆయుధ డిపోపై బిజెపి నేత వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నిర్మించ తలపెట్టిన ఆయుధ డిపోను ఎట్టి పరిస్థితుల్లోనైనా నెలకొల్పుతామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వెంకటలక్ష్మి చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వంకావారిగూడెం పంచాయతీలోని గ్రామాల గిరిజనులు భూములు ఇచ్చేది లేదని ఖరాఖండీగా చెబుతున్నా డిపో కచ్చితంగా పెడతామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అంటే బిజెపికి ప్రజాభిప్రాయం అవసరం లేదా, లేదా అక్కడి గిరిజనులను అసలు మనుషులుగానే చూడరా అని నిలదీశారు. డిపో పెట్టాలని అంత ఆసక్తిగా ఉంటే ఏజెన్సీలో అటవీ భూములు వేలాది ఎకరాలు ఉన్నాయని, అందులో నిరభ్యంతరంగా పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. అందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఒప్పించుకోవాలని హితవు పలికారు. కాదని వంకావారిగూడెం భూముల్లోనే డిపో పెట్టదలిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, బిజెపి, కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఆయుధ డిపో నిర్మాణం వల్ల ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రజలకు మేలు జరుగుతుందని బిజెపి తప్పుడు ప్రచారం చేస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న పోలవరం ప్రాజెక్టు విషయంలో నిర్వాసితులకు చేసిన మేలు ఏమిటో బిజెపి వారు తెలపాలని కోరారు. ఆయుధ డిపోకు తాము వ్యతిరేకం కాదని, అయితే అది ప్రజలు వ్యతిరేకిస్తున్న చోట కాకుండా ప్రజలకు ఇబ్బంది లేని మరో ప్రాంతంలో పెట్టాలని ఆయన సూచించారు.

ఆ భూములకు ప్రొటెక్షన్ ఆర్డర్ దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోర్టు పెండింగ్‌లో ఉన్న వివాదాస్పద భూములకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇవ్వడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని సిర్రివారిగూడెం గ్రామానికి సంబంధించిన వివాదాస్పద భూమికి సంబంధించి హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా, ఆ భూమికి ఇన్‌ఛార్జి తహశీల్దార్ ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఏజెన్సీలో భూ వివాదం ఉన్నప్పుడు రెండు పక్షాలను పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, ఒక పక్షం వైపు అధికారులు కొమ్ముకాయడం సరికాదని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఎస్.సీతారామయ్య, కె.నాగదుర్గ, సిహెచ్.కొండలరావు, శంకురుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలింత మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అనారోగ్యంతో బాలింత మృతి చెందిన ఘటన మండలంలోని ములగలంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగ్రాల మౌనిక (25) గర్భిణిగా ఉన్నప్పటి నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. అయితే కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో వైద్యం పొందుతూ 20 రోజుల క్రితం పాపకు జన్మనిచింది. అనంతరం రెండు రోజులకు తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమెకు పుట్టిన పాప ఆరోగ్యంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

కొనసాగిన తనిఖీలు

28 బస్సులపై కేసు, ఒక బస్సు సీజ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లావ్యాప్తంగా రెండో రోజు రవాణా శాఖాధికారులు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఒక బస్సును సీజ్ చేసి 28 కేసులు నమోదు చేశారు. జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఏలూరు రవాణా శాఖ అధికారులు, జంగారెడ్డిగూడెం రహదారిలో జంగారెడ్డిగూడెం రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మొత్తం 28 ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం ఏరియా పరిధిలో వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ట్యాక్స్ లేకుండా నడుస్తున్న ఒక బస్సు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిగోపాల్ సీజ్ చేశారు.

200 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వాక్షలేటి పాత్ ల్యాబ్స్ సంయుక్త డైరెక్టర్లు పిసిఎన్.రాజు, అనిల్‌కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించారు. బిపి, షుగర్, ఊబకాయం (ఒబిసిటి) ఇసిజి వంటి పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందించారు. ఈ శిబిరంలో రాజమండ్రి వి స్టార్ హాస్పిటల్ వైద్యులు, ఎమ్‌డి డాక్టర్ కె.వంశీ, యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.వెంకటచైతన్య, గైనకాలజిస్ట్ ఎస్.లక్ష్మి, జనరల్ మెడిసిన్ ఎమ్‌డి డాక్టర్ అవినాష్ వైద్య సేవలను అందించారు.

జెట్టి గురునాధం వ్యాఖ్యలు సరికావు

జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

జెట్టి గురునాధం వ్యాఖ్యలు సరికావని జనసేన చింతలపూడి మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసిపి కాపు నాయకులు రానున్న రోజుల్లో కాపు ద్రోహులుగా మిగిలిపోతారరన్నారు. కాపులను రాజకీయంగా వాడుకోవడం మానేసి వారి అభ్యున్నతికి కృషి చేయలన్నారు. జనసేన పార్టీని, పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతామని తెలిపారు. జనసేన పార్టీ వల్ల కాపులకు మేలు జరిగిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో లింగపాలెం మండలంలో కాపులపై కేసులు పెడితే మీరెక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కాపులకు జనసేన పార్టీలో, కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్నారు.

2న శ్రీవారి తెప్పోత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి తెప్పోత్సవం స్వామి వారి పుష్కరిణి (నృసింహసాగరం)లో నవంబర్ రెండో తేదీన రాత్రి ఎనిమిది గంటల సమయంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి తెలిపారు. యాత్రికులు, గ్రామస్తులు పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తాము చదువుకున్న పాఠశాలను కలియతిరుగుతూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు అత్మీయంగా పలకరించుకొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా తమ బ్యాచ్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మిత్రులను ఘనంగా సన్మానించుకున్నారు. ఆటలు, పాటలు, గ్రూపు డాన్స్‌లతో ఆద్యంతం హుషారుగా గడిపారు. ఈ కార్యక్రమంలో జె.విజయ్‌కుమార్, సిహెచ్.శ్రీనివాసరావు, గిరి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి పాలనలోనే నకిలీ మద్యం విక్రయాలు'

ప్రజాశక్తి - ముదినేపల్లి


క్యూ ఆర్ కోడ్ అతికిస్తున్న నేతలు

రాష్ట్రంలో గత వైసిపి పాలనలోనే నకిలీ మద్యం విక్రయాలు జోరుగా జరిగాయని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌పై ముదినేపల్లిలోని మద్యం దుకాణాలకు వెళ్లి వినియోగదారులకు టిడిపి నాయకులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరమల్లు నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన క్యూఆర్ కోడ్ ద్వారా మద్యాన్ని ధ్రువీకరించుకోవచ్చున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పరిశీలించి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోసిన పాండురంగారావు, బొప్పన సుందరరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ముసునూరు

కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి గణేష్ అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన ఉన్న స్థలంలో పశు వైద్య హాస్పిటల్‌నకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గోపవరం మాజీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, వైస్ ప్రెసిడెంట్ సాయిల జగ్గయ్య, కార్యదర్శి కర్ర యేసుపాదం, పులిచర్ల గంగాధరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ చైతన్య, డాక్టర్ రామ్‌నారాయణ, డాక్టర్ పాలబల్ల అనూష, సెక్రటరీ వెంకటేశ్వరరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు పులిచర్ల భూచక్రం, గోపవరం మాజీ సర్పంచి ఉండవల్లి ధర్మరాజు, గుడిమెల్లి జయరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు పల్లిపాము జయరాజు, కొప్పు శ్రీనివాసరావు, వెలగపూడి గంగాధరావు, నందిగం లక్ష్మి, మేరుగు కిషోర్‌బాబు, కొసరాజు సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు కొండ్రుపాటి వెంకమ్మ, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు


కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. సదరు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఐ క్రాంతికుమార్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం తెల్లవారుజాము సమయంలో మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా వస్తున్న ఐషర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో కోళ్ల వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం నుంచి కాకినాడ జిల్లాకు చేపల మేతకు తరలిస్తున్నట్లు డ్రైవర్ చెప్పారన్నారు.వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలు తప్పనిసరిగా డ్రైడేను ఆచరించాలి

- మలేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్



ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలందరూ కూడా ప్రతి శుక్రవారం డ్రై డే ఆచరించాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. సాయంత్రం ఐదు గంటలయ్యేసరికి కిటికీలు మూసి వేయాలని, వేపాకు పొగ వేసుకోవాలని చెప్పారు. ఆయన ప్రజాశక్తితో జరిగిన ముఖాముఖిలో పలు విషయాల గురించి వివరించారు.

ప్రశ్న : ప్రస్తుతం జిల్లాలో మలేరియా వ్యాప్తి ఎలా ఉంది?

అధికారి : జిల్లాలో మలేరియా వ్యాప్తి జూన్, జూలై నెలలో అధికంగా ఉంది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల నుంచి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతానికి మలేరియా కేసులు సాధారణ స్థితిలో ఉన్నాయి.

ప్రశ్న : ఏయే మండలాలు, గ్రామాలు మలేరియా ప్రభావానికి అధికంగా గురవుతున్నాయి?

అధికారి : బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో అధికంగా ఎక్కువ కేసులు నమోదవుతాయి. పులిరామన్నగూడెం, ఎల్అండ్‌టి పేట, కోయిదా పిహెచ్‌సిల్లో అధికంగా నమోదవుతున్నాయి.

ప్రశ్న : గత సంవత్సరంతో పోలిస్తే మలేరియా కేసులు పెరిగాయంటున్నారు దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

అధికారి : గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం మలేరియా కేసులు పెరిగాయి. వర్షాలు ముందుగా రావడంతో మలేరియా కేసులు పెరిగాయి.

ప్రశ్న : జిల్లాలో మలేరియా కేసును గుర్తించడం కోసం ఎటువంటి విధానాలు పాటిస్తున్నారు?

అధికారి : మలేరియా కేసును గుర్తించడం కోసం ఆర్‌డి కిట్ ఒకటి ఉంది. దీనిని రాపిడ్ డయాగ్నోస్టిక్ కిట్ అంటారు. దీని ద్వారా 15 నిమిషాల్లో రిజల్ట్ వస్తుంది. అది మనం ఫీల్డ్ లెవెల్‌లో ఎఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి తిరిగి జ్వరాలు ఉన్న దగ్గర పరీక్షలు చేస్తారు. అదే పిహెచ్‌ఎల్‌లో అయితే స్లైడ్ మెథడ్‌ను ఉపయోగిస్తాం.

ప్రశ్న : జిల్లాలో మలేరియా నియంత్రణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఏమిటి?

అధికారి : ప్రతి సంవత్సరం పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో మలాథియన్‌ను మూడు రౌండ్లు పిచికారీ చేస్తాం. మే నెలలో మొదలు పెట్టి సెప్టెంబర్ వరకు చేశాం. గత సంవత్సరం అధికంగా నమోదైన సమస్యాత్మక ప్రాంతాల్లో వాటిని పిచికారీ చేస్తాం. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎసిఎం రెండు రౌండ్లు పిచికారీ చేస్తాం. అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. నీరు నిల్వ లేకుండా ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : కాలనీల్లో, ఇళ్లల్లో దోమల నియంత్రణ చర్యలు, ఫాగింగ్, లార్వా నియంత్రణ చర్యలు ఎంత చురుకుగా చేస్తున్నారు?

అధికారి : ఫాగింగ్ లార్వా నియంత్రించడానికి పంచాయతీ రాజ్‌తో అనుసంధానం చేసుకుంటాం. సమస్యాత్మక ప్రాంతాల్లో ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ వారానికి ఒకసారి చేస్తాం.

ప్రశ్న : గ్రామస్థాయిలో మలేరియా పరీక్షల కోసం కిట్లు, మందులు అందుబాటులో ఉన్నాయా?

అధికారి : మలేరియా కిట్లు, ఆర్‌డి కిట్లు ఆశావర్కర్ల స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. మందులు కూడా పిహెచ్‌సి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : ప్రజల్లో మలేరియాపై అవగాహన ఏవిధంగా ఉంది?

అధికారి : గతంలో ప్రజలందరికీ దోమతెరలు ఇచ్చి వాటిని ఉపయోగించుకోమని చెప్పాం. ప్రజలందరికి బాగానే అవగాహన వచ్చింది. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని తెలియజేస్తున్నాం. ఇంకా ప్రజల్లో అవగాహన పెరిగితే దానిని మనం లార్వా దశలోనే నియంత్రించవచ్చు.

ప్రశ్న : డేటా సేకరణ, కేస్ ట్రాకింగ్ విషయాల్లో ఎలాంటి ఆధునిక విధానాలు అమలు చేస్తున్నారు?

అధికారి : ఫీల్డ్ లెవల్ నుంచే ఎస్ ఫామ్, పిఫామ్ అని ఉంటాయి. వాటిని బేస్ చేసుకుని ఎక్కడైనా కేసులు ఉంటే, ఐహెచ్‌ఐపి అనే నూతన విధానం ప్రభుత్వం తీసుకొచ్చింది. దాని ద్వారా డేటా సేకరణ చేస్తున్నాం.

ప్రశ్న : ఏలూరు మలేరియా రహిత జిల్లాగా మారడానికి ఎంత సమయం పట్టవచ్చు?

అధికారి : జీరో మలేరియా అవ్వడానికి ప్రభుత్వం 2027కి టార్గెట్ పెట్టుకుంది. పూర్తిగా నియంత్రించడానికి ప్రభుత్వం 2030కి టార్గెట్ పెట్టుకుంది. ఆ దిశగానే పని చేస్తున్నాం.

ప్రశ్న : మీరు ప్రజలకు ఇవ్వాలనుకునే ముఖ్య సందేశం ఏమిటి?

అధికారి : ప్రజలందరూ కూడా ముఖ్యంగా మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి. ఎప్పటికప్పుడు నీరు నిల్వ లేకుండా ఇంట్లో, ఇంటి బయట పరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి డ్రై డే ఆచరించాలి. ముఖ్యంగా ప్రతిఒక్కరూ నీటి మీద మూత పెట్టుకోవాలి. సాయంత్రం ఐదు గంటలయ్యేసరికి కిటికీలు మూసివైసి వేపాకు పొగను వేసుకోవాలి.

మొంథా తుపాన్.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తుపాన్ సమయంలో ప్రజలకు సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని తెలిపారు. మొంథా తుపాను దూసుకొస్తుండటంతో తీర ప్రాంతంలో అనిశ్చితి నెలకొందని, భారత వాతావరణ శాఖ అత్యున్నత హెచ్చరిక స్థాయి అయిన రెడ్ అలర్ట్ జారీ చేయడంతో పౌరులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల ఏర్పడే ఏ విధమైన విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి ధైర్యంగా, సిద్ధంగా ఉండాలని తెలిపారు.

మొంథా తుపాన్ ముందస్తు చర్యల్లో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి ఇన్‌ఛార్జి తహశీల్దార్, ఎంపిడిఒ కామేశ్వరి, చింతలపూడి ఎస్ఐ సతీష్ సూచించారు. మొంథా తుపాన్ నేపథ్యంలో ఎలాంటి ప్రమాద పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు తహశీల్దార్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించారు. తుపాన్ సమయంలో ప్రజల భద్రత, తక్కువ ప్రాంతాల్లో నివసించే కుటుంబాల తరలింపు, సహాయ శిబిరాల ఏర్పాటు, అత్యవసర సేవల సిద్ధత, వర్షాలు, గాలుల కారణంగా కలిగే నష్టాలను తగ్గించే చర్యలపై చర్చించారు.

టి.నరసాపురం : మొంథా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావంతో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు.

ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని ఉద్యాన పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ తెలిపారు. నూజివీడులో హెచ్ఒ హేమ ఆదివారం మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో అధిక వర్షాలు వచ్చిన అనంతరం ఉద్యాన పంటలను సంరక్షించుకునేందుకు యాజమాన్య పద్ధతులు అవలంభించాలన్నారు. తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను వివరించారు.

ద్వారకాతిరుమల : ప్రకృతి విపత్తు పరిస్థితులు రాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సూచించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని విభాగాల ప్రభుత్వ సిబ్బంది, నాయకులతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామస్థాయి అధికారులు, గ్రామ ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ఈ విపత్తును ఎదుర్కొవటానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎక్కడ ఏ అవసరం ఉన్నా ప్రభుత్వ బిల్లులతో పని లేకుండా అవసరమైన అన్ని ఖర్చులు తామే భరిస్తామని హామీ ఇచ్చారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన భోజనాన్ని ద్వారకా తిరుమల దేవస్థానం వారితో సిద్ధం చేస్తామని తెలిపారు.

ముదినేపల్లి : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎదురయ్యే ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు మండల స్థాయి అధికారులంతా సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఆర్ఐఒ కె.యోహాన్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యోహాను మాట్లాడుతూ గ్రామాల్లో విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు పర్యటించి ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించాలన్నారు.

మొంథా తుపాన్ తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున మండల ప్రజలు సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలని ముదినేపల్లి పోలీసులు ఆటోలో మైక్ ద్వారా ఆదివారం మండలంలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో 27, 28, 29 తేదీల్లో తుపాన్ వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలవరం : మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో గోదావరి నదీ మధ్యలో ఉన్న పట్టిసీమ శ్రీవీరభద్రేశ్వర స్వామివారి ఆలయానికి వెళ్లే యాత్రికులు మూడు రోజుల పాటు ప్రయాణాలు మానుకోవాలని పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. తుపాన్ నేపథ్యంలో పోలవరం-పట్టిసీమ మధ్య బోట్ సర్వీస్ తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండి, అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112, పోలవరం ఎస్ఐ 9440796664, సిఐ 9440796663 సంప్రదించవచ్చని తెలిపారు.

కుక్కునూరు : తహశీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి పిజి.బుజ్జిబాబు అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టి ఎవరికీ ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపవద్దని వార్డెన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఆగిరిపల్లి : అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అదేవిధంగా ప్రజలు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆగిరిపల్లి ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఇబి.విలియమ్స్ కోరారు. ఆగిరిపల్లి తహశీల్దార్ కార్యాయంలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, పశుసంవర్ధక, విద్యుత్, విద్య, ఇరిగేషన్, సమగ్ర శిశు అభివృద్ధి, వైద్య శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు.

మూడు రోజుల్లో తాత్కాలిక వంతెన నిర్మాణం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - కలిదిండి

కలిదిండి నుంచి కైకలూరుకు వెళ్లే స్థానిక లాల్వా డ్రెయిన్‌పై వంతెన కూలి పోయి రోడ్డు కొట్టుకుపోవడంతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. వంతెన కూలి రోడ్డు కొట్టుకుపోవడంతో కలిదిండి నుంచి కైకలూరుకు రాకపోకలు నిలిచిపోయాయని, కరెంటు స్తంభాలపై నడక ప్రమాదకరంగా ఉందని, వాహన రాకపోకలు లేక ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని నాయకులు, రైతులు ఆమెకు వివరించారు. దెబ్బతిన్న వంతెన స్థానంలో మూడురోజుల్లో తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, పెటేటి వెంకట సత్యనారాయణ, అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎల్ఐసి నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


అదానీ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు ఎల్ఐసి నిధులను దుర్వినియోగం చేయడంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కోట్ల మంది ఎల్ఐసి వాటాదారుల కష్టార్జితాన్ని మోడీ దుబారా చేస్తున్నారని తెలిపారు. ఎవరి ఒత్తిడితో ఎల్ఐసి అధికారులు ఒక ప్రయివేట్ కంపెనీని రక్షించే కార్యక్రమానికి పూనుకున్నారో చెప్పాలని పేర్కొన్నారు.

ఎల్‌విపిఇఐ ప్రాథమిక నేత్ర సంరక్షణా కేంద్రం ప్రారంభం

దెందులూరు : ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్‌విపిఇఐ) తమ 279వ ప్రాథమిక నేత్ర సంరక్షణా కేంద్రాన్ని పెదవేగి మండలం వంగూరు గ్రామంలో ఆదివారం ప్రారంభించారు. వంగూరు గ్రామంలోని కాసరనేని గోపాలకృష్ణయ్య క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు కె.దమయంతి, కె.రాజు, కె.విద్యాసాగర్ అందించిన విరాళాలు, సహకారంతో స్థాపించారు. ఈ సందర్భంగా ఎల్‌వి.ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ వంగూరు గ్రామం, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యున్నతమైన నేత్ర సంరక్షణా సేవలను అందించాలనే దృక్పథంతో ఈ నూతన విజన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళిరావు


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

చేపలు, రొయ్యలు పట్టుబడి కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వణుదుర్రులో వ్యవసాయ కార్మిక సంఘం ద్వితీయ మహాసభ మట్లపూడి కనకారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న మహంకాళరావు మాట్లాడుతూ వ్యవసాయంలో యంత్రాలు పెరగడంతో పనులు లేక అత్యధిక మంది చేపల పట్టుబడి, కూలి పని పైన ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఉదయం రెండు గంటల నుంచి సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి ఉంటుందని, ప్రమాదాలకు గురైన పట్టించుకునే నాధుడు ఉండటం లేదని, ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం వీరికి భద్రత కల్పించాలని కోరారు. మహాసభలో ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, 200 రోజులు పని కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను నిలుపుదల చేయాలని, ముంపునకు గురవుతున్న కాలనీలకు డ్రెయినేజీ వ్యవస్థలను మెరుగుపరచాలని తీర్మానాలు చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మట్లపూడి కనకారావు, కార్యదర్శిగా చిన్నం మాధవ, పది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దాకరపు నాగేశ్వరరావు, బద్దె థామస్, తాడంకి నాగబాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి కోడూరు వాసుల విరాళం



విరాళాలు పంపిస్తున్న వల్లభనేని శివాజీ, తదితరులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎపి రాజధాని అమరావతి నిర్మాణానికి తమ వంతు విరాళాలు ఇచ్చి సిఎం చంద్రబాబు చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఇచ్చిన పిలుపుమేరకు ముదినేపల్లి మండలం కోడూరు గ్రామస్తులు స్పందించారు. ఆదివారం కోడూరు గ్రామ సచివాలయంలో వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో అమరావతికి జీవం పోద్దాం రూ.116 లు సాయం చేద్దాం, చేయి చేయి కలుపుదాం అమరావతిని నిర్మిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూ.116 విరాళాలను ఎపి సిఆర్‌డిఎ బ్యాంకు ఖాతాకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విరాళాలు అందించారు. అనంతరం విరాళాలు పంపించిన గ్రామస్తులను డాక్టర్ మనోజ్ శాలువాలు కప్పి పూలమాలాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖుడు వల్లభనేని శివాజీ, విఆర్ఒ ఏసుబాబు, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల వద్ద ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ క్యూ ఆర్ కోడ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులు, బార్ల వద్ద మద్యం నాణ్యత తెలుసుకునే ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్‌కు సంబంధించిన క్యూ ఆర్ కోడ్ కలిగిన స్టిక్కర్లు అతికించారు. మద్యం వినియోగదారులకు యాప్‌కు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేసి మద్యం నాణ్యత ఎలా తెలుసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐతో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.


క్యూ ఆర్ కోడ్ అతికిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - కలిదిండి

అధిక వర్షాలతో ముంపునకు గురైన మండలంలోని పడమటిపాలెం బంకు కాలనీవాసులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం కలిదిండి, ముదినేపల్లి మండలాల ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు అన్నారు. బంకు కాలనీలో ఆయన ఆదివారం పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అధిక వర్షాల సమయంలో చుట్టుపక్కల నీరు కాలనీ మీదుగా వెళ్లడంతో కొన్ని రోజుల పాటు కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. పది కుటుంబాలు పైనే ముంపులో ఉన్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ముంపు నీరు తొలగించడంతో పాటు ముంపు బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణను కోరారు. సిపిఎం నాయకులు దొంగ వెంకట సత్యనారాయణ, పెరుమాళ్ల గోపీ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పట్టణంలో అధ్వానంగా మారిన నల్లదిబ్బ-సాయినగర్ రోడ్డును త్వరలోనే బిటి రోడ్డుగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణతో కలిసి శనివారం సాయంత్రం స్థానిక వన్‌టౌన్ 1, 2 డివిజన్‌లో పరిధిలో నల్లదిబ్బ రోడ్డు, సాయి నగర్ ఏరియాలోని రోడ్లను పరిశీలించారు. రూ.50 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు పనులకు ప్రతిపాదనలు కూడా తయారు చేశామని, త్వరలోనే రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

వర్షంతో మినుము పంట రైతులకు నష్టం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని రామన్నగూడెం, పరిసర ప్రాంతాల్లో అకాల వర్షాల కారణంగా మినుము పంట అపార నష్టాల పాలైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.50 వేలు ఖర్చు చేయగా ఒక్క గింజ కూడా చేతికి అంది వచ్చే పరిస్థితి లేదన్నారు. మినుము పంట పూర్తిగా మొక్కలు రావడంతో అపారమైన నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మినుము పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛద సేవా సంస్థల వారు ముందుకు రావాలని మానవతా సంస్థ అధ్యక్షులు మందపాటి రామకృష్ణ చెప్పారు. స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన ముప్పిడి విజయ్ ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురి కావడంతో అతని వైద్య ఖర్చు నిమిత్తం రూ.మూడు వేలు అందించారు. ఈ కార్యక్రమంలో నక్క బాబి, రాము, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, విఎస్ఎన్.స్వామి, షేక్ భాషా, తీగిరిపల్లి చంటి, మోహన్‌రావు, రమేష్, మట్టే శ్రీను, ఎస్‌బిజి.శేఖర్, నిడదవోలు రామారావు పాల్గొన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును ఆయన స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు ఎంఎల్ఎలు మాట్లాడుతూ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. ఆయనతో పాటు జనసేన జిల్లా కార్యదర్శి కరాటం సాయి, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ రాజు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ వంగ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్యాంపస్ పరిసరాలు, సమీప ప్రాంతాల్లో ఉన్న షాపు యజమానులతో, కస్టమర్లకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా భూమిని, నీటిని, జీవవైవిధ్యాన్ని కాపాడాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని, ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత జీవన విధానం అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు స్వచ్ఛభారత్ ప్లాస్టిక్ రహిత భారత్ అనే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులంతా ఏకం కావాలి

కొయ్యలగూడెం : ఆర్యవైశ్యులంతా ఏకం కావాలని కొయ్యలగూడెం ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు మాటూరి సుధీర్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, యువతులకు సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలిపొందిన వారికి గౌరవ అతిథులుగా విచ్చేసిన పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందించారు. పంచాయతీ ప్రథమ సర్పంచి కీర్తిశేషులు కొల్లూరి విశ్వేశ్వరరావు కొయ్యలగూడెం పట్టణ అభివృద్ధికి కోట్లాది రూపాయల ఆస్తులను దానం చేయడంతో ఆయనను స్మరించుకుంటూ కొద్ది నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి సాయి కృష్ణ, సొలస సుధాకర్, ఉమామహేశ్వరరావు, ఆర్యవైశ్యులంతా కుటుంబాల సమేతంగా పాల్గొన్నారు.